క్లుప్తంగా

సీఐ గిరిబాబు బాధ్యతల స్వీకారం



తిరువూరు: తిరువూరు సీఐగా కె. గిరిబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వీఆర్‌ వీస్సీ రిజర్వులో ఉన్న ఆయనను తిరువూరుకు బదిలీపై నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న అబ్దుల్ నబీ మచిలీపట్నం బదిలీ అయ్యారు. సీఐ గిరిబాబును తిరువూరు సర్కిల్‌లోని ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

జాలాది రాజారావు జయంతి

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ సినీ గేయ రచయిత జాలాది రాజారావు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవా కమిటీ సభ్యులు మాట్లాడుతూ జాలాది 275 సినిమాలకు 1,500లకు పైగా పాటలు, పలు సాంఘిక నాటకాలు, వెయ్యి కవితలు రాశారని కొనియాడారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ

చాట్రాయి: ఆరుగొలనుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మమ్మ, అంకమ్మ అమ్మవార్ల ఆలయ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ అనంతరం ఉదయం 9.36 గంటలకు ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదమంత్రాల మధ్య నిర్వహించారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఆరుగొలనుపేట సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పామర్తి నాగేశ్వరరావు, పర్వతాపురం సర్పంచ్ మిద్దె శివాజీ తదితరులు అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం రెండు వేల మందికి అన్నదానం చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తిరువూరురూరల్: ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి కనక దుర్గాభవాని 23 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉన్న వారిని గుర్తించి సుక్రోజ్ ఇంజక్షన్ చేశామని వైద్యాధికారి తెలిపారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు.

ఆదివాసీలు ప్రకృతి ప్రేమికులు

మైలవరం: ఆదివాసీలుగా పిలవబడే గిరిజన తెగలకు చెందిన ప్రజలు ప్రకృతిని అమితంగా ఆరాధిస్తారని, అందుకే వారు ప్రకృతి ప్రేమికులుగా పిలవబడతారని ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ఆదేశానుసారం గిరిజనుల జీవన విధానం, హక్కులు, నాగరికత విధానాలపై ఆగస్ట్ 9న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ గిరిజన దుస్తులతో నృత్యం చేసి సందడి చేశారు. పాఠశాల కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మెట్టగుట్ట(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ నూతన పాలకవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా పంది వెంకట్రావ్‌గౌడ్, సెక్రటరీగా మన్నే నరసింహమూర్తి, కోశాధికారిగా నాళ్లా నారాయణరావు, గౌరవాధ్యక్షులుగా ఏడుకొండ అప్పారావు, యనమద్ది విజయ్‌కుమార్, కమిటీ సభ్యులుగా మరో 14 మంది ప్రమాణ స్వీకారం చేశారు.

పాదయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

ఎ.కొండూరు: నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు, తండాల్లో కిడ్నీ వ్యాధి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో జరుగనున్న ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య కోరారు. చీమలపాడులో శుక్రవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈనెల 27, 28 తేదీల్లో డయాలసిస్ సెంటర్ నుంచి విజయవాడ కలెక్టరేట్ కార్యాలయం వరకు ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు.

ఉచితంగా పాస్‌పోర్టుల రిజిస్ట్రేషన్

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉచిత పాస్‌పోర్టు మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ కార్యక్రమంలో 160 మందికి ఉచితంగా పాస్‌పోర్టులు రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. ఇంకా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే సెల్: 78099 55599 నంబర్‌ను సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ కార్డు తీసుకురావాలని చెప్పారు. పాస్‌పోర్టు మేళాలో లియో గ్లోబల్ ఓవర్సీస్, విజయవాడ మేనేజర్స్ అబ్బాయి చౌదరి, మల్లిక పాల్గొన్నారు.

చాట్రాయి తహసీల్దార్‌గా ప్రశాంతి

చాట్రాయి: చాట్రాయి తహసీల్దార్‌గా డి.ప్రశాంతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కోనసీమ జిల్లా కాట్రేనిపాడు తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

బూరుగుగూడెంలో పొలంబడి

చాట్రాయి: బూరుగుగూడెం గ్రామంలో శుక్రవారం రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ అధికారి బి.శివశంకర్ రైతులకు అవగాహన కల్పించారు.

అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరవు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు కూటమి ప్రభుత్వంలో రక్షణ కరవైందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. విజయవాడలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకంపై సుత్తులు, ఇతర పరికరాలతో ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ స్థానిక బోస్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. రాజ్యాంగ నిర్మాతను అవమానించిన కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, రాజ్యాంగంపై టీడీపీకి గౌరవం లేదని స్వామిదాసు ధ్వజమెత్తారు. కుల,మతాలకతీతంగా వ్యవహరించాల్సిన పాలకులు అంబేడ్కర్‌ను అవమానించడం సిగ్గుచేటన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు దుర్గారావు, మోదుగు ప్రసాద్, గుంటూరు మస్తాన్, ఆంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గత్తం నాగేశ్వరరావు, చలమాల సత్యనారాయణ, షేక్ జాకీర్, కాలసాని గోపాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి..

ఎ.కొండూరు: విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని జెడ్పీటీసీ భూక్య గనియా డిమాండ్ చేశారు. ఎ. కొండూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గనియా మాట్లాడుతూ ఈ సంఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వెంటనే స్పందించి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, ఎస్. వెంకటేశ్వరరావు, ఎం. సాంబయ్య, ఎం. లక్ష్మయ్య, పి. చిన్న వెంకయ్య, బి. శ్రీను, కె. వైకుంఠరావు, జె. పెదబాబు, ఎం. రవి పాల్గొన్నారు.



తిరువూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న స్వామిదాసు, నాయకులు

దాడి హేయం..

విస్సన్నపేట: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని ఎంపీపీ పిల్లి మేర్సీవనజాక్షి అన్నారు. దాడిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన మంచిపనిని చెరిపివేయాలనే దురుద్దేశంతో కొంతమంది కావాలనే అంబేడ్కర్ విగ్రహం శిలాఫలకంపై దాడి చేశారని విమర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు రెడ్డి శ్రీనివాసరావు, గాజుల శ్రీనివాసరావు, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు గద్దల మల్లయ్య నాయకులు పాల్గొన్నారు.

పేరు తొలగించడం దారుణం..

గంపలగూడెం: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఉన్న ఆవిష్కరణకర్త మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును దుండగులు ధ్వంసం చేయడం దారుణమని గంపలగూడెం జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం తోటమూల వై-జంక్షన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుండగులను కఠినంగా శిక్షించడం ద్వారా ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని శామ్యూల్ డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నుపాటి శేషగిరిరావు, అల్లు కృష్ణారెడ్డి, దుంపా వెంకటరెడ్డి, బాలు, జగన్నాథరావు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎ.కొండూరులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



విస్సన్నపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు



తోటమూలలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పట్టణంలో మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన పర్యటన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన శుక్రవారం పట్టణంలో పర్యటించి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. కొండపల్లి రైల్వేస్టేషన్ సెంటర్, జెడ్పీ పాఠశాల ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలపై మూతలు లేకపోవడంతో ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నట్లు గుర్తించారు. ఓపెన్ డ్రెయినేజీలపై శ్లాబులు వేయించే అవకాశాలను ఆమె పరిశీలించారు. ఏఈ సాయి గణేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్ బి.రమ్యకీర్తనను వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కట్టలేరులో వరద తగ్గుముఖం



గంపలగూడెం: మండలంలోని ప్రధాన నీటివనరైన కట్టలేరులో శుక్రవారం వరద కొంతమేర తగ్గుముఖం పట్టింది. ఏటి ఎగువ, స్థానిక వర్షాలు గురువారం మధ్యాహ్నం నుంచి తెరపివ్వడంతో ఏటిలో వరద తగ్గింది. రాకపోకల కోసం నిర్మించిన డైవర్షన్ రహదారిపై మాత్రం రెండు అడుగుల ఎత్తున నీరు పారుతూనే ఉంది. ఈ పరిస్థితిలో ఏటిపై రాకపోకలు ఐదో రోజు కూడా కొనసాగకపోవడంతో ప్రలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

సమన్వయంతో పనిచేయాలి

డీపీఓ శివప్రసాద్ యాదవ్

జి.కొండూరు: సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో గ్రామ పంచాయతీలే కీలకమని జిల్లా పంచాయతీ అధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం నిర్వహించిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తొలుత ఆయన జి.కొండూరు గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో సత్వరమే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను అమలులోకి తీసుకురావాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, అంతర్గత రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం, పూడికతీత, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు దృష్టి సారించాలని సూచించారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు తమ హక్కులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.



జి.కొండూరు శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీపీఓ శివప్రసాద్ యాదవ్

ఆదాయ వనరులు పెంపొందించుకోవాలి..

తిరువూరురూరల్: గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన ఆదాయ వనరులు పెంపొందించుకోవాలని తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి అన్నారు. సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, పరిపాలనపై ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్లతో పాటు స్థానికంగా పంచాయతీలు ఆదాయాన్ని పెంపొందించుకునే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పటిష్టపరచుకోవాలని, ఆస్తి పన్ను వసూలు చేయాలని చెప్పారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ బండి వెంకటరత్నం, రిసోర్స్‌పర్సన్ స్వామి నాయక్ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

తిరువూరు: లక్ష్మీపురం పాల కేంద్రం పరిధిలో కృష్ణా మిల్క్ యూనియన్‌కు పాలు పోసే రైతులకు శుక్రవారం మొదటి విడత బోనస్ పంపిణీ చేశారు. పాల కేంద్రం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మేనేజరు సాంబశివమూర్తి రూ.1.50 కోట్ల చెక్కులను రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ యూనియన్‌కు వచ్చే ఆదాయంలో 75 శాతం రైతులకే అందిస్తున్నామని, గత మూడేళ్లలో సంస్థ టర్నోవర్ పెరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.12 వందల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా నిర్ణయించారని చెప్పారు. రైతులు పాల నాణ్యత పెంపునకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో యూనియన్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● **రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం మండలం ముచ్చినపల్లి గ్రామంలో తిరువూరు క్లస్టర్ పరిధిలోని పాడిరైతులకు బోనస్‌ను పంపిణీ చేశామని తిరువూరు క్లస్టర్ మేనేజర్ టి. సాంబశివమూర్తి శుక్రవారం తెలిపారు. తిరువూరు క్లస్టర్ పరిధిలో 200 పాల కేంద్రాలకు బోనస్ అందజేశామన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

పుల్లూరు(మైలవరం): మైలవరం మండలం పుల్లూరులో ది కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో పాల ఉత్పత్తి దారులు 204 మందికి శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు. పాలు పోసిన వారిలో ప్రథమ స్థానంలో పల్లెపోగు నాగేశుకు రూ.9,467, ద్వితీయ స్థానంలో ఉన్న ముత్తారెడ్డికి రూ.9,104, తృతీయ స్థానంలో ఉన్న పాల నాగేశ్వరరెడ్డికి రూ.7,609 చెల్లించామని సంఘం అధ్యక్షులు అప్పిడి సాంబిరెడ్డి తెలిపారు.

సొసైటీ సభ్యులు కేవైసీ చేయించుకోవాలి

నూజివీడు పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈఓ నాగేశ్వరరావు

నూజివీడు: నూజివీడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలోని నూజివీడు పట్టణంతో పాటు 11 గ్రామాల్లోని సభ్యులందరూ కేవైసీ వివరాలను తప్పనిసరిగా డిజిటలైజేషన్ చేయించుకోవాలని సంఘ ఇన్‌చార్జి సీఈఓ నీలం నాగేశ్వరరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం సహకార సంఘాలకు అనుబంధంగా ఉన్న సంఘాల్లోని సభ్యుల కేవైసీ వివరాలు ఆయా సంఘాల్లో కంప్యూటరైజేషన్ జరుగుతోందని, వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. సంఘాలలో సభ్యత్వం తీసుకుని ఇప్పటివరకు ఏ విధమైన లావాదేవీలు జరుపని సభ్యులు కూడా సంఘంలో సభ్యునిగా కొనసాగాలంటే తమ రికార్డులను వెంటనే డిజిటలైజేషన్ చేయించుకోవాలన్నారు. ఇందుకోసం రైతులు తమ ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఫోన్ నంబర్‌తో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులోని సొసైటీలో సంప్రదించాలని చెప్పారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆదేశాలను అనుసరించి తదుపరి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగం ఆధారపడి ఉంటుందని తెలిపారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమాలు

సీపీఎం, సీఐటీయూ నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడదామని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ అన్నారు. కొండపల్లి ఐడీఏలో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయరంగంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, లారీ డ్రైవర్స్, ముఠా వర్కర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌లను బహిష్కరించాలి

మైలవరం: దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్‌లను బహిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ కార్యక్రమం మైలవరం సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు దోచిపెడుతోందని, కార్పొరేట్‌ల చేతుల నుంచి వ్యవసాయ రంగాన్ని రక్షించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సందిపాము ఇస్సాకు, నాయకులు పాల్గొన్నారు.



కొండపల్లి ఐడీఏలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

● **తిరువూరు:** కేంద్ర ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తూ తిరువూరు బోస్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి రైతు సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతు సంఘ జిల్లా నాయకులు ఎస్. నాగేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ వాడకాన్ని బట్టి లోడు పెంచుకోవాలి

జి.కొండూరు: గృహ, వ్యాపార అవసరాలకు అదనపు విద్యుత్ అవసరమైనప్పుడు విద్యుత్ శాఖకు తగిన రుసుం చెల్లించి అదనపు లోడును పెంచుకోవాలని ఏపీసీపీడీసీఎల్ విజిలెన్స్ డీఈ కమలకుమారి, డీఈ ఆపరేషన్స్ శ్రీనివాసరావు అన్నారు. జి.కొండూరు మండల పరిధిలో విద్యుత్ శాఖ సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేపట్టారు. డీఈ కమలకుమారి మాట్లాడుతూ జి.కొండూరు మండల పరిధిలోని 3,160 గృహాలను తనిఖీ చేయగా 331 మంది వినియోగదారులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. అదనంగా వినియోగిస్తున్న 430 కిలో వాట్ల విద్యుత్ లోడుకు గానూ లోడు పెంచుకునేందుకు వీలుగా రూ.8.60 లక్షల రుసుం చెల్లించాలని వినియోగదారులకు డిమాండ్ నోటీసులను ఇచ్చామని వివరించారు. తనిఖీల్లో నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, మైలవరం డివిజన్ల పరిధిలోని 100 మంది విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక ఏఈ సీహెచ్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

గంపలగూడెం: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు వైష్ణవాలయాల్లో లక్ష్మీదేవి అమ్మవారికి శుక్రవారం సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు, అర్చకుల బృందంచే నిర్వహించిన కుంకుమార్చనలో పలువురు మహిళలు పాల్గొన్నారు. ముందుగా అర్చకులు సీతారామచంద్రస్వామి, లక్ష్మణ, ఆంజేయస్వామికి విశేష పూజలు చేశారు.

లోపూడి కోదండ రామాలయంలో..

లోపూడి (ముసునూరు): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లోపూడిలోని కోదండ రామాలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి మహిళలు పూజాదికాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, 108 స్త్రీమూర్తులను గావించి పూజలు చేశారు. తమ కుటుంబాలను క్షేమంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి దేశానికి, సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. కొండపల్లిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టౌన్ కార్యదర్శి మహేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వి.మురళీమోహన్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలకు బుద్ధదేవ్ భట్టాచార్య నిదర్శనమన్నారు. మాజీ సర్పంచి కొల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, ఐద్వా నాయకురాలు బేబీ సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

● **తిరువూరు:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి ఎస్. నాగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం భట్టాచార్య సంతాపసభ జరిగింది. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. భట్టాచార్య పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ మాట్లాడుతూ వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, మురుగు నీటిని సాధ్యమైనంతవరకు సమీపంలోని డ్రెయినేజీలు, కాలువల్లోకి వెళ్లే విధంగా చూడాలన్నారు. దోమల నివారణ, డెంగీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పి. మురళీ మోహనరావు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ఆగిరిపల్లి: అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నూజివీడు అగ్నిమాపక శాఖాధికారి మత్తయ్య అన్నారు. శుక్రవారం తోటపల్లి హీల్ స్కూల్‌లో విద్యార్థులకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పవన్, హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

నూజివీడు: ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి అన్నారు. పట్టణంలో శుక్రవారం హెల్మెట్ ధరించి వాహనాన్ని నడిపే వాహన చోదకులకు పోలీసులు గులాబీ పువ్వు ఇచ్చి అభినందించారు. పట్టణ ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ప్రతి ఆరు నెలలకు ఓసారి రక్తదానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య అన్నారు. కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల మేనేజ్‌మెంట్ ప్రోత్సాహంతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎన్వై రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

మైలవరం: పాము కాటుతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జంగాలపల్లిలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మైలవరం మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన కంభంపాటి జయరాజు (56) మల్లెపూల తోటలో రోజు వారి కూలీగా వెళుతుంటాడు. యథావిధిగా కూలీకి వెళ్లిన జయరాజు మల్లె తోటలో పాదులు సరిచేస్తుండగా పాదలో మాటుగా ఉన్న పాము కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు చికిత్స నిమిత్తం మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

రాష్ట్ర మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం విజయవాడ మాకినేని బసవపున్నయ్య హాల్‌లో శనివారం జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఇబ్రహీంపట్నం సంఘ కార్యాలయంలో మహాసభ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. సమావేశానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సమావేశంలో 26 జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారులు హాజరై నూతన పాలకవర్గాన్ని ఎన్నుకుంటారని చెప్పారు.

పీహెచ్‌సీకి ఏసీ బహూకరణ

ఇబ్రహీంపట్నం: దాతల సహకారాన్ని వైద్యశాల సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి కార్యదర్శి ఎ.సురేష్ (ఇన్‌కేమ్ ల్యాబ్స్ డైరెక్టర్) విరాళంతో సమకూర్చిన నూతన ఏసీ మిషన్‌ను పీహెచ్‌సీ వైద్యురాలు సయ్యద్ పర్వీన్‌కు శుక్రవారం అందజేశారు. హాస్పిటల్‌లో రోగుల సదుపాయం కోసం ఆపరేషన్ థియేటర్ రూమ్‌కు ఏసీ అమర్చుతామని డాక్టర్ పర్వీన్ తెలిపారు.